పోలీస్ కుటుంబాలకు కమ్యూనిటీ హాల్

- మిలటరీ హోటల్ స్థాయిలో క్యాంటీన్
- త్వరలో ఏర్పాటుకు ప్రతిపాదనలు

నిర్మాణంలో ఉన్న కమ్యూనిటీ హాల్

రాంనగర్, నవంబర్ 9 : పోలీసు కుటుంబాలకు సకల సౌకర్యాలు కల్పించేందుకు ఉన్నతాధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కమిషనరేట్ కేంద్రంలో కమ్యూనిటీ హాల్, పోలీస్ క్యాంటీన్ కోసం ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించారు. గ్రీన్ సిగ్నల్ ఇస్తే సాధ్యమైనంత త్వరగా కమ్యూనిటీ హాల్, క్యాంటీన్ నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలనేది ఉన్నతాధికారుల ఆలోచన. శిథిలావస్థలో ఉన్న క్వార్టర్లలో సిబ్బంది నివసిస్తుండడంతో వాటిని తొలగించకుండా గతంలో ఏర్పాటు చేసిన జాన్ విల్సన్ ఓపెన్ థియేటర్‌ను కమ్యూనిటీ హాల్‌గా మార్చేందుకు నిర్ణయించారు. దీంతోపాటు పోలీసు గెస్ట్ హౌస్‌ను ఆనుకొని ప్రధాన రహదారి వెంట ఉన్న ఖాళీ స్థలాన్ని పోలీస్ క్యాంటీన్‌గా ఏర్పాటు చేసి స్టార్ హోటల్స్ స్థాయిలో హంగులు సమకూర్చాలని పోలీస్ శాఖ భావిస్తున్నది. ప్రభుత్వ అనుమతి వస్తే వేసవికాలంలోగా నిర్మాణ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఉన్నతాధికారులు భావిస్తున్నారు.

స్వీప్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టరేట్/కొత్తపల్లి/రామడుగు, నవంబర్ 9: ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం-2025లో భాగంగా చేపట్టిన రెండు రోజుల ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి కోరారు. జిల్లావ్యాప్తంగా బూత్‌స్థాయిలో చేపట్టిన ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలను పలు చోట్ల ఆమె శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 2025 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండబోయే వారంతా ఓటర్లుగా నమోదు చేయించుకోవాలన్నారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, మరణించిన వారి ఓట్లను తొలగించడంతో పాటు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి నివాసాన్ని మార్చిన ఓటర్లు సైతం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ voters.eci.gov.in వెబ్‌సైట్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆమె వెంట అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో కె.మహేశ్వర్, కొత్తపల్లి మున్సిపల్ కమిషనర్ వేణుమాధవ్, తహసీల్దార్ రాజేశ్, రామడుగు మండల ప్రత్యేకాధికారి అనిల్‌కిరణ్, ఎంపీడీవో, తహసీల్దార్, తదితరులు ఉన్నారు.

ఆర్టిజన్లను కన్వర్షన్ చేయాలని విజ్ఞప్తి

ముకరంపుర, నవంబర్ 9: రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న ఆర్టిజన్ కార్మికులను కన్వర్షన్ చేయాలని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ కన్వర్షన్ జేఏసీ ఆధ్వర్యంలో శనివారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను కలిసి వినతిపత్రం అందజేశారు. ఒకే సంస్థలో ఒకే రూల్స్ అమలు చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ శివకృష్ణ, రఘునాథ్ రెడ్డి, కే శ్రీనివాస్ నాయక్, మేకల శ్రీనివాస్, డీ రవి, అబుషర్ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లిబృందం ఆటోను ఢీకొట్టిన టిప్పర్: ఒకరికి గాయాలు

హుజూరాబాద్ టౌన్, నవంబర్ 9: హుజూరాబాద్ పోలీస్ స్టేషన్ ఎదురుగా శనివారం సాయంత్రం ఓ టిప్పర్ అదుపుతప్పి ముందు వెళ్తున్న పెళ్లి బృందం ట్రాలీ ఆటోను ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. పెళ్లి బృందంతో వెళ్తున్న ట్రాలీ ఆటోను వెనుకాలే వస్తున్న మొరం టిప్పర్ అదుపుతప్పి ఢీకొన్నది. ఆటోలో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి గాయపడగా, వెంటనే బ్లూ కోల్ట్స్ సిబ్బంది సమీపంలోని ఏరియా హాస్పిటల్‌కు చికిత్స కోసం తరలించారు. ఆటోలోని మిగతా ప్రయాణికులకు ప్రమాదమేమీ లేకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు.

శ్రీ చైతన్యలో రక్తదాన శిబిరం

తిమ్మాపూర్, నవంబర్ 9: మండలంలోని ఎల్‌ఎండీ కాలనీలో గల శ్రీ చైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ప్రీమియర్ బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 150మంది విద్యార్థులు రక్తదానం చేశారు. కళాశాల ప్రతినిధులు, బ్లడ్ బ్యాంకు ప్రతినిధులు పాల్గొన్నారు.

చేనేత సాంస్కృతిక విభాగం సారథిగా గుండేటి

గుండేటి రమేశ్

విద్యానగర్, నవంబర్ 9 : తెలంగాణ చేనేత ఐక్య వేదిక రాష్ట్ర సాంస్కృతిక విభాగం సారథిగా కరీంనగర్‌కు చెందిన ప్రముఖ సినీ నేపథ్య జానపద గాయకుడు గుండేటి రమేశ్‌ను నియమిస్తూ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, తనను నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు, సహకరించిన పద్మశాలీ సంఘాలకు రమేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

షెడ్యూల్ ప్రకారం సర్వే పూర్తి చేయాలి

- కలెక్టర్ పమేలా సత్పతి

మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కలెక్టరేట్, నవంబర్ 9: అధికారులు నిర్దేశించిన గడువులోగా ఇంటింటి సర్వే పూర్తి చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సర్వే నిర్వహించాలని సూచించారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో వివిధ విభాగాల అధికారులతో ఇంటింటి సర్వేపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సర్వే కోసం జారీ చేసిన బుక్‌లెట్‌లోని అంశాల ప్రకారం ఎలాంటి అనుమానాలు, సందేహాలకు తావులేకుండా ప్రజల నుంచి కచ్చితమైన సమాచారం సేకరిస్తూ, ఫారంలో వివరాలు నమోదు చేయాలన్నారు. అంతకుముందు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ, అర్హులైన ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందించే క్రమంలోనే సమగ్ర కుటుంబ సర్వే నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, డీఆర్‌డీవో శ్రీధర్, ముఖ్య ప్రణాళిక శాఖ అధికారి కొమురయ్య, డీఆర్‌వో బి.వెంకటేశ్వర్లు, జిల్లా పంచాయతీ అధికారి రవీందర్, యూత్ కో ఆర్డినేటర్ రాంబాబు, తదితర అధికారులు పాల్గొన్నారు.

మానకొండూర్‌కు చేరుకున్న మాలల మహాపాదయాత్ర

మహా పాదయాత్రకు స్వాగతం పలుకుతున్న మండల నాయకులు

మానకొండూర్, నవంబర్ 9: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా దళితుల ఐక్యత కోసం జాతీయ మాల మహానాడు-తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన మాలల మహాపాదయాత్ర శనివారం రాత్రి మానకొండూర్‌కు చేరింది. ఈ సందర్భంగా మాల మహానాడు మానకొండూర్ మండలాధ్యక్షుడు బొల్లం వెంకటస్వామి ఆధ్వర్యంలో మహాపాదయాత్రకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ మాట్లాడారు. కార్యక్రమంలో మానకొండూర్ మాలసంఘం అధ్యక్షుడు వేల్పుల రాములు, ప్రధాన కార్యదర్శి ఉండింటి ఆంజనేయులు, సభ్యులు బొల్లం రామస్వామి, ఉండింటి శ్యాంసన్, బొల్లం మల్లేశం, ఉండింటి అశోక్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

కమాన్‌చౌరస్తా, నవంబర్ 9: జిల్లా కేంద్రంలోని వావిలాలపల్లి శ్రీసీతారామ చంద్రస్వామి ఆలయంలో 27వ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం విశ్వక్సేనారాధన, బ్రహ్మకలశ స్థాపన, అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణ, సాయంత్రం నిత్యహవనం శాస్త్రోక్తంగా జరిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మేచినేని అశోక్ రావు, కార్పొరేటర్ మేచినేని వనజ, ప్రధానార్చకుడు సముద్రాల సత్యనారాయణాచార్యులు, ఆలయ కమిటీ బాధ్యులు, భక్తులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాక్షస పాలన

జమ్మికుంట, నవంబర్ 9: రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతున్నదని, దళితుల పక్షాన నిలబడి ధర్నా చేస్తున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై జరిగిన దాడి హేయమని బీఆర్ఎస్, అనుబంధ సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎమ్మెల్యేను పోలీసులు అడ్డుకోవడం తగదన్నారు. ప్రజల పక్షాన నిలబడే ఎమ్మెల్యేకే రక్షణ లేకుండా పోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. నాటి ఎమర్జెన్సీ పాలన గుర్తుకొస్తున్నదని, ఇలాగే జరిగితే ప్రజలు తరిమికొట్టే రోజులు ఎంతో దూరంలో లేవన్నారు. ఆరు గ్యారెంటీలను అమలు చేయకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. కౌశిక్‌రెడ్డికి ఏదైనా జరిగితే చూస్తూ ఊరుకునేది లేదని, ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో నాయకులు కొమ్ము నరేశ్, హరీశ్‌వర్మ, మల్లికార్జున్, వీరన్న, సలీం, శ్రీకాంత్, ప్రవీణ్, అజయ్ తదితరులున్నారు.

ఫీజు బకాయిలు విడుదల చేయాలి

కమాన్‌చౌరస్తా, నవంబర్ 9: రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలు విడుదల చేయాలని ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని వాగేశ్వరి డిగ్రీ కళాశాల ఆవరణలో ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా కార్యదర్శి గడ్డం శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు రూ.7,800 కోట్లు బకాయిలు విడుదల చేయకపోవడంతో దాదాపు 13 లక్షల మంది విద్యార్థులు తీవ్ర మనోవేదన చెందుతున్నారని పేర్కొన్నారు. జిల్లా నాయకులు అభిరామ్, మహేశ్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

కేతిరెడ్డికి శుభాకాంక్షల వెల్లువ

దేవేందర్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న వినోద్‌కుమార్

తిమ్మాపూర్, నవంబర్ 9: బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా 'గుడ్ లక్ కేడీఆర్' అంటూ కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, మాజీ ఎంపీ వినోద్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మండల వ్యాప్తంగా నాయకులు, అభిమానుల ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఎల్ఎండీ తాపాల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వికలాంగుల పాఠశాలలో పండ్లు పంచారు. కార్యక్రమాల్లో పొన్నాల సంపత్, మాతంగి లక్ష్మణ్, గడ్డి రమేశ్, శెట్టి శివరామకృష్ణ, దేవేందర్, రాజేందర్, కొండ్ర రాజు, రొడ్డ వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో గురుకులాల సందర్శన

జమ్మికుంట, నవంబర్9: బీఆర్ఎస్వీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పట్టణాధ్యక్షుడు కొమ్ము నరేశ్ ఆధ్వర్యంలో జమ్మికుంట పట్టణంలోని సోషల్ వెల్ఫేర్, మైనార్టీ పాఠశాలలను నాయకులు సందర్శించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యదర్శి అప్పని హరీశ్‌వర్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు పాఠశాలల ప్రిన్సిపాల్స్, విద్యార్థులను కలిశారు. వసతులు, తదితర సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను చూశారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ విద్యార్థుల కోసం మండలానికో గురుకులం ఏర్పాటు చేశారని, విద్యార్థుల అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. రేవంత్ సర్కార్ వచ్చినప్పటి నుంచి విద్యార్థులు దవాఖానల పాలవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు సౌకర్యాలు కల్పించడంతో పాటు పౌష్టికాహారం అందించాలని డిమాండ్ చేశారు. ఇక్కడ నాయకులు అనిల్, శ్రీకాంత్, కౌశిక్, ప్రవీణ్, అజయ్ తదితరులున్నారు.

చొప్పదండి దవాఖాన సిబ్బందికి డీసీహెచ్ఎస్ అభినందన

విద్యానగర్, నవంబర్ 9 : మూడు సంవత్సరాల నుంచి ప్రసవాలు జరుగని చొప్పదండి దవాఖానలో శనివారం సాధారణ ప్రసవం చేయడంతో అక్కడి వైద్యులను డీసీహెచ్ఎస్ డాక్టర్ చంద్రశేఖర్ ప్రత్యేకంగా అభినందించారు. చొప్పదండికి చెందిన రాగం మానస సాధారణ ప్రసవం కాగా, తల్లి, బిడ్డా ఆరోగ్యంగా ఉన్నారని తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వైద్యులు, సిబ్బంది సహకారంతో చొప్పదండి, హుజూరాబాద్, జమ్మికుంట దవాఖానల్లో ప్రసవాలు చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలు ప్రభుత్వ దవాఖానలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎమ్మెల్సీగా గెలిపించండి: కేశిపెద్ది శ్రీధర్ రాజు

కరీంనగర్ రూరల్, నవంబర్ 9: పట్టభద్రులు, నిరుద్యోగుల సమస్యలపై శాసనమండలిలో గొంతెత్తి పరిష్కారానికి కృషి చేస్తానని, తనను కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీగా గెలిపించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేశిపెద్ది శ్రీధర్ రాజు కోరారు. శనివారం మొగ్దుంపూర్ గ్రామంలోని ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 33 సంవత్సరాలుగా విద్యార్థి, నిరుద్యోగ, సమస్యలపై పోరాటం చేస్తూ విజయాలు సాధిస్తూ వారికి అండగా నిలుస్తున్నానని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలిచిన తనకు పట్టభద్రులు, నిరుద్యోగులు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో బీసీ నాయకులు పిట్టల రమేశ్, మియాపూర్ రవీంద్రాచారి, శ్రీనివాస్, చొప్పర సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల బాలుర డిగ్రీ కళాశాలకు న్యాక్ 'బీ ప్లస్ ప్లస్' గ్రేడ్

కరీంనగర్ రూరల్, నవంబర్ 9: బొమ్మకల్‌లోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర డిగ్రీ కళాశాల మొదటి ప్రయత్నంలోనే న్యాక్ 'బీ ప్లస్ ప్లస్' గ్రేడ్ సాధించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. వేణుగోపాల్ రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యాక్ నిపుణుల బృందం గత నెలలో కళాశాలను సందర్శించి విద్యా ప్రమాణాలు పరిశీలించిందని పేర్కొన్నారు. ఈ క్రమంలో రాష్ట్రంలోనే మొదటి సారిగా 2.96 గ్రేడ్ పాయింట్లతో బీ ప్లస్ ప్లస్ గ్రేడ్ సాధించిన తొలి గిరిజన సంక్షేమ బాలుర డిగ్రీ కళాశాలగా చరిత్ర సృష్టించినట్లు తెలిపారు. ఈ గ్రేడ్ సాధించడంలో కీలకంగా వ్యవహరించిన వైస్ ప్రిన్సిపాల్ బీ లావణ్య, బోధన, బోధనేతర సిబ్బంది, స్టడీ రిపోర్టును రూపొందించిన ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ వీ అన్వేశ్‌ను ప్రిన్సిపాల్ అభినందించారు. న్యాక్ 'బీ ప్లస్ ప్లస్' గ్రేడ్ గుర్తింపుతో కళాశాలలో అత్యున్నత ప్రమాణాలు నెలకొల్పడానికి, యూజీసీ నిధులు సాధించడానికి మార్గం సుగమమం అయిందని పేర్కొన్నారు.

'మతం మారిన దళితులకు ఎస్సీ సర్టిఫికెట్ జారీ చేయద్దు'

తెలంగాణచౌక్, నవంబర్ 9: మతం మార్చుకున్న దళితులకు ఎస్సీ సర్టిఫికెట్ జారీ చేయకుండా అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కలెక్టర్‌కు వినతి పత్రం అందించినట్లు జాతీయ ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి ఉప్పులేటి లక్ష్మణ్ తెలిపారు. నగరంలోని సమితి కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ, మతం మారిన దళితులకు రాజ్యాంగ ప్రకారం బీసీ సీ సర్టిఫికెట్ జారీ చేయాల్సి ఉంటుందన్నారు. కానీ, అధికారులు ఎలాంటి విచారం జరుపకుండానే ఎస్సీ సర్టిఫికెట్ ఇస్తున్నారని ఆరోపించారు. దీంతో నిజమైన దళితులకు అన్ని రంగాల్లో అన్యాయం జరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ చొరవ తీసుకొని మతం మారిన దళితలకు ఎస్సీ సర్టిఫికెట్ ఇవ్వకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ

క్రీడా దుస్తులు అందుకున్న విద్యార్థులతో మాజీ సర్పంచ్ దామోదర్, ఉపాధ్యాయులు

గంగాధర, నవంబర్ 9 : కాసారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్థానిక మాజీ సర్పంచ్ వేముల దామోదర్ శనివారం క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. భవిష్యత్తులో పాఠశాలకు మరింత సహకారం అందజేస్తామని తెలిపారు. క్రీడా దుస్తులు అందజేసిన దామోదర్‌ను ఎంపీవో ప్రభాకర్‌రావు శాలువాతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం శశికాంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బట్టు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, నవంబర్ 9: సబ్ స్టేషన్ల మెయింటనెన్స్, ఏబీ స్విచ్ బిగింపు, విద్యుత్ తీగల కింద ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున ఆదివారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు టౌన్-1, కరీంనగర్ రూరల్ ఏడీఈలు పీ శ్రీనివాస్, రఘు వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు.

- ఉదయం 9.30నుంచి 11.30గంటల వరకు 33/11కేవీ బావుపేట, శాతవాహన సబ్ స్టేషన్ల పరిధిలోని ప్రాంతాలు.
- ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు 11కేవీ నారాయణ ఫీడర్, మున్నాలాల్ ఫీడర్ పరిధిలోని ప్రాంతాలు.

ఉదయం 9నుంచి 11గంటల వరకు డాక్టర్ స్ట్రీట్, శ్రీనగర్, సివిల్ హాస్పిటల్ వెనుక ప్రాంతం, గాంధీ రోడ్డు, గర్ల్స్ జూనియర్ కాలేజీ రోడ్డు, అహ్మద్ పుర, రూరల్ పోలీస్ స్టేషన్ ఏరియా, బోయవాడ, గంజ్, టవర్ సర్కిల్, సిక్‌వాడీ, కమాన్ ఏరియా, సీపీ ఆఫీస్ రోడ్డు, లక్ష్మీనగర్, కమాన్ నుంచి హౌసింగ్ బోర్డు వెళ్లే రోడ్డు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

'రామన్నపల్లి'లో ఉచిత వైద్య శిబిరం

జమ్మికుంట, నవంబర్9: మున్సిపల్ పరిధిలోని రామన్నపల్లిలో జనవికాస స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్య శిబిరానికి హనుమకొండలోని నరసింహ దవాఖాన వైద్యులు నిక్కత్, తేజస్విని హాజరయ్యారు. పలువురికి వైద్య పరీక్షలు చేశారు. మందులు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వైద్యులు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, రోగాల బారిన పడకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ సెంటర్ మేనేజర్ సులోచన, తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★Supervisors, Sales Exicutives, Team Leaders, Dealers for a Car & Bike Polish Company. Free Room & Cooking facility. Ph: 8019399008.
NT-339365-All

HOUSE FOR SALE

★Hyd. ఆల్వాల్: 100 గజాలు W/F, ఇండిపెండెంట్ ఇల్లు G/F, 1-BHK, N/E-డోర్, వాస్తు, మంజీరా & బోర్, KNR హైవే హాఫ్ Km., క్లియర్ టైటిల్ @ 72 లక్షలకే. ఓనర్: 9701473704.
NT-339316

CHANGE OF NAME

★Bheemari Naresh S/o. Achmaipally Balnarsu, Mother Name Achmaipally Kanakalaxmi, H.No: 6-53/1, Lingannapet, Gambhiraopet mandal, Rajanna Sircilla Dist, my Father & Mother surname was changed to Bheemari Naresh S/o Bheemari Balnarsu, Bheemari Kanakalaxmi (Mother)
NTK-000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

రాష్ట్రస్థాయి రోడ్ సైక్లింగ్‌లో కరీంనగర్ విద్యార్థి ప్రతిభ

కొత్తపల్లి, నవంబర్ 9: జనగాంలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి రోడ్డు సైక్లింగ్ పోటీల్లో కరీంనగర్‌కు చెందిన విద్యార్థి హృతికేశ్ అద్భుత ప్రతిభ చాటి బంగారు పతకం సాధించాడు. హృతికేశ్ మాస్ స్టార్ విభాగంలో గోల్డ్ మెడల్, టైం ట్రైల్ విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించి జిల్లాకు పేరును తీసుకువచ్చాడు. రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించడంతో పాటు జాతీయ పోటీలకు ఎంపికైన హృతికేశ్‌ను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌తో పాటు జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ వీ నరేందర్‌రెడ్డి, అధ్యక్ష కార్యదర్శులు కెప్టెన్ బీ మధుసూదన్‌రెడ్డి, సురభి వేణుగోపాల్ అభినందించారు.

జాతీయస్థాయి ఇన్నోవేషన్‌కు సెయింట్ జార్జ్ విద్యార్థినుల ప్రాజెక్ట్

కొత్తపల్లి, నవంబర్ 9 : జాతీయస్థాయి ఇన్నోవేషన్‌కు స్థానిక సెయింట్ జార్జ్ సీబీఎస్ఈ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థినులు తయారు చేసిన ప్రాజెక్ట్ ఎంపికైంది. 'ప్రయాస్-ఎన్‌సీఈఆర్‌టీ' విద్యార్థుల నుంచి పరిశోధనకు అనుగుణంగా ఉండే ప్రాజెక్టులను ఆహ్వానించగా, పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న సన్నిధి, పునిత నీమ్ (వేప) సిరప్‌కు సంబంధించి పంపిన ప్రాజెక్ట్ ఎంపికైంది. ఈ సందర్భంగా ప్రాజెక్టు రూపొందించిన విద్యార్థినులతోపాటు వారికి సహకరించిన గైడ్ టీచర్లు మల్లికార్జున్, జయంతిని సెయింట్ జార్జ్ విద్యా సంస్థల చైర్మన్ డా. పీ ఫాతిమారెడ్డి అభినందించారు. అకాడమిక్ సీఈవో ఉమాకాంత్, ప్రిన్సిపల్స్ భార్గవ్, నిరంజన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అబాకస్ పోటీల్లో చాంపియన్‌గా అల్ఫోర్స్ విద్యార్థి

స్నితిక్‌ను అభినందిస్తున్న అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి, నవంబర్ 9: ఇటీవల హైదరాబాద్‌లో ప్రముఖ అబాకస్ అకాడమీ నిర్వహించిన రాష్ట్రస్థాయి అబాకస్ పోటీల్లో కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌లో పాఠశాలకు చెందిన 6వ తరగతి విద్యార్థి స్నితిక్ పాల్గొని అసమాన ప్రతిభతో మాడ్యుల్ చాంపియన్‌గా నిలువగా, అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వీ నరేందర్‌రెడ్డి శనివారం అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ యోగా పోటీలకు శ్రీ చైతన్యవిద్యార్థి

తిమ్మాపూర్, నవంబర్ 9: మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల శ్రీ చైతన్య డిఫెన్స్ అకాడమీకి చెందిన గుండు చైతన్య త్వరలో అస్సాం రాష్ట్రంలో జరుగనున్న జాతీయ యోగా పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ పల్లె శ్యాంసుందర్‌రెడ్డి తెలిపారు. పతకంతో తిరిగి రావాలని విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి విద్యార్థిని అభినందించారు.

అల్ఫోర్స్‌లో అంతర్జాతీయ అకౌంటింగ్ డే


వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న అతిథులు

కమాన్‌చౌరస్తా, నవంబర్ 9 : అంతర్జాతీయ అకౌంటింగ్ డే సందర్భంగా జిల్లా కేంద్రంలోని అల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో ముందస్తు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు కళాశాల కరస్పాండెంట్ వీ రవీందర్ రెడ్డి అధ్యక్షత వహించగా, కరీంనగర్ ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ డీ నిరంజనాదారి, శాతవాహన యూనివర్సిటీ ప్రొఫెసర్ డి. హరికాంత్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. అకౌంటెంట్ల ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్స్, కామర్స్ విభాగం అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీల అమలుపై పాదయాత్ర చేసే దమ్ముందా?

- కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

మాట్లాడుతున్న బండి సంజయ్

విద్యానగర్, నవంబర్ 9: తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహారాష్ట్రకు పోయి పచ్చి అబద్ధాలు వల్లిస్తున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మండిపడ్డారు. ప్రజలకిచ్చిన హామీల అమలు, రుణమాఫీ, ఆరు గ్యారెంటీలపై తెలంగాణలో ప్రజలకు వివరిస్తూ పాదయాత్ర చేసే దమ్ముందా? అని ప్రశ్నించారు. శనివారం కరీంనగర్‌లోని మమతా థియేటర్‌లో బీజేపీ కార్యకర్తలు, ఏబీవీపీ నాయకులతో కలిసి కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ 'జితేందర్ రెడ్డి' సినిమాను వీక్షించారు. ఈ సందర్భంగా తనను కలిసిన సినిమా హీరో రాకేశ్ వర్రె, దర్శక, నిర్మాతలు, సినిమా యూనిట్ సభ్యులను సన్మానించి అభినందించారు. అనంతరం వారితో కలిసి బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ, నక్సలైట్ భావజాలమున్న వారివల్లే ఎంతో మంది జితేందర్ రెడ్డి లాంటోళ్లు చనిపోయారన్నారు. నేడు రేవంత్ రెడ్డి సర్కార్ నక్సలైట్ల భావజాలమున్న వాళ్లకు విద్యా కమిషన్‌లో చోటు కల్పించి సభ్య సమాజానికి ఏ సంకేతాలు పంపుతున్నదని నిలదీశారు. తక్షణమే కమిషన్‌ను రద్దు చేసి కొత్త వారికి చైర్మన్, సభ్యులుగా అవకాశం కల్పించాలన్నారు.

రెడ్డి ఐక్య వేదిక ఆత్మీయ సమ్మేళనం

గన్నేరువరం, నవంబర్ 9: మండలకేంద్రంలో శనివారం రెడ్డి ఐక్య వేదిక ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, రెడ్డి సంక్షేమానికి సంఘటితంగా ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. అనంతరం రెడ్డి ఐక్య వేదిక మండలాధ్యక్షుడిగా బేతెల్లి రాజేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా నందికొండ స్వామిరెడ్డి, గౌరవాధ్యక్షుడిగా కాంతాల కిషన్ రెడ్డి, సహాయ కార్యదర్శులుగా అన్మాసుల తిరుపతిరెడ్డి, కాంతాల సురేందర్‌రెడ్డి, మండల కోఆర్డినేటర్‌గా బొమ్మాడి సంపత్‌రెడ్డి, అన్మాసుల శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శిగా నందికొండ సురేందర్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జిగా గడ్డం సుమిత్‌రెడ్డి, అడ్వైజర్ మెంబర్‌గా దేవసాని తిరుపతిరెడ్డిని నియమించారు.

నేటి నుంచి నటనలో ఉచిత శిక్షణ

కమాన్‌చౌరస్తా, నవంబర్ 9 : జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నటనలో ఉచిత శిక్షణ ప్రారంభిస్తున్నట్లు మాస్క్ ఫిలిం ఇనిస్టిట్యూట్ చైర్మన్ భూనాథాచారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిక్షణలో 50 మంది విద్యార్థులు పాల్గొంటారని, వీరికి శిక్షణ నగరంలో ఫిల్మ్ భవన్‌లో ఉంటుందని తెలిపారు.

ఆలయాల్లో భక్తుల సందడి

కమాన్‌చౌరస్తా, నవంబర్ 9: కార్తీకమాసం తొలి శనివారం సందర్భంగా ఆలయాల్లో భక్తుల సందడి కనిపించింది. ఈ సందర్భంగా ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. దీపాలు వెలిగించారు. పూజల సందర్భంగా ఆయా ఆలయాల అధికారులు, నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ప్రజా సమస్యలపై ఉధృత పోరాటాలు

తెలంగాణచౌక్, నవంబర్ 9: నగర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు ఉధృతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. నగరంలోని పార్టీ కార్యాలయం ముకుందలాల్ మిశ్రాభవనంలో శనివారం నిర్వహించిన సీపీఎం పట్టణ 9వ మహాసభలో ఆయన మాట్లాడారు. నగరంలో పలు కాలనీవాసులకు ఇబ్బందిగా మారిన డంప్ యార్డ్‌ను ఎత్తి వేయాలని నగరపాలక సంస్థను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి సత్యం, నాయకులు కనకరాజు, జగదీశ్, లింగారెడ్డి, వినయ్, నిఖిల్ పాల్గొన్నారు.

శభాష్.. పోలీస్

- తప్పిపోయిన బాలికను 20నిమిషాల్లో గుర్తించి తల్లిదండ్రులకు అప్పగింత

జమ్మికుంట, నవంబర్ 9: డయల్ 100కు కాల్ వచ్చిన 20 నిమిషాల్లోనే తప్పిపోయిన ఎనిమిది సంవత్సరాల బాలికను పోలీసులు వెతికి పట్టుకొని తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసులు స్పందించిన తీరుపై 'శభాష్ పోలీస్' అంటూ సర్వత్రా అభినందనలు వెల్లువెత్తాయి. వివరాలిలా ఉన్నాయి.. మున్సిపల్ పరిధిలోని కృష్ణకాలనీకి చెందిన దంపతులు కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. వారికో కూతురు ఉంది. శనివారం సాయంత్రం బాలికను తాత కొండూరు కాంప్లెక్స్‌లోని పిల్లల పార్కుకు తీసుకుని వచ్చాడు. మనుమరాలిని ఆడుకొమ్మని చెప్పి, తన కూతురును బస్సెక్కించేందుకు బస్టాండుకు వచ్చాడు. తిరిగి పార్కుకు వచ్చే సమయానికి బాలిక కనిపించలేదు. ఎక్కడ వెతికినా కనిపించలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు డయల్ 100కు కాల్ చేశారు. సమాచారం అందుకున్న సీఐ వీ రవి సిబ్బందిని రంగంలో దింపారు. హెడ్ కానిస్టేబుల్ సదయ్య ఆధ్వర్యంలో సిబ్బంది నిఘా నేత్రాలను పరిశీలించారు. చివరకు ప్రభుత్వ దవాఖాన ఏరియాలో బాలిక కనిపించడంతో ఊపిరిపీల్చుకున్నారు. బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు. బాలిక తప్పిపోయిందని ఫిర్యాదు చేసిన కేవలం 20నిమిషాల్లోనే ఛేదించిన హెచ్‌సీ, సిబ్బందిని సీఐ రవి అభినందించారు.

ఎరుకల కులస్తుల సమస్యలు పరిష్కరించాలి

తెలంగాణచౌక్, నవంబర్ 9: ఎరుకల కులస్తుల సమస్యను పరిష్కరించాలని తెలంగాణ ఎరుకల ప్రజా సమితి రాష్ట్ర అధ్యక్షుడు తిరుపతి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని సంఘ కార్యాలయంలో శనివారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పందుల పెంపకం కోసం ప్రతి ఎరుకల కుటుంబానికి ఐదు గుంటల స్థలం, ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. ఎరుకల కులస్తుల సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో సంఘ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు పోచయ్య ఆధ్వర్యంలో ఈ నెల 12న ఉదయం పది గంటలకు దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఎరుకల కులస్తులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రాజశేఖర్, సారవ్వ, నాగరాజ్, తిరుపతి పాల్గొన్నారు.

గోశాలల్లో గోపాష్టమి వేడుకలు

తిమ్మాపూర్, నవంబర్ 9: గోపాష్టమి దినోత్సవం సందర్భంగా జిల్లాలోని పలు గోశాలల్లో శనివారం వేద పండితుడు పురాణం మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. గోవులను పూజించారు. కార్యక్రమంలో గోరక్షా, బజరంగ్, విశ్వహిందూపరిషత్ నాయకులు రాధాకృష్ణారెడ్డి, శంకరవర్మ, తిరునగిరి వెంకటాద్రి స్వామి, ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, చల్లా మోహన్‌రెడ్డి, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్వేకు ఆదిలోనే హంసపాదు


సర్వే నిర్వహిస్తున్న ఎన్యుమరేటర్

కరీంనగర్ రూరల్, నవంబర్ 9: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేకు ఆదిలోనే హంసపాదు ఎదురైంది. మండలంలోని 17 గ్రామాల్లో మొత్తం 12.210 ఇండ్లల్లో ఇప్పటి వరకు 10,386 కుటుంబాలు ఉన్నట్లు గుర్తించగా, కనీసం 11 వేల సర్వే ఫారాలు అందించాల్సిన అధికారులు, కేవలం వెయ్యి ఫారాలు మాత్రమే ఇవ్వడంతో నివ్వెరపోవడం ఎన్యుమరేటర్ల వంతైంది. మండలంలో 56 మంది ఎన్యుమరేటర్లు 150-175 కుటుంబాల వివరాలు నమోదు చేయాల్సి ఉండగా, తొలి రోజు ఒక్కొక్కరికి 20 ఫారాలు కూడా అందని పరిస్థితి ఏర్పడింది. ఇక సర్వే సందర్భంగా కనీసం ఇంక్ ప్యాడ్స్ కూడా సమకూర్చకపోవడం ఎన్యుమరేటర్లు ఇక్కట్లు పడాల్సి వచ్చింది.